క్లుప్తంగా

వెంకటరెడ్డి సేవలు ఎనలేనివి



అంకలంపాడు మాజీ సర్పంచ్ కేసరి వెంకటరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

కామవరపుకోట: అంకాలంపాడు గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ కేసరి వెంకటరెడ్డి గ్రామ ప్రజలకు చేసిన సేవలు ఎనలేనివని సర్పంచ్ చొక్కా స్వర్ణ అన్నారు. వెంకటరెడ్డి 6వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వర్ణ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం వెంకటరెడ్డి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ఆయన బాటలో వారి తనయులు అంకాలంపాడు పంచాయతీ అభివృద్ధికి అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో అంకాలంపాడు గ్రామ ఉప సర్పంచ్ కీసరి శ్రీహరి రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భూదేవి పండుగ



రెడ్డికుంకాలలో భూదేవి పండుగ నిర్వహిస్తున్న గిరిజనులు

పోలవరం రూరల్: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనలు సంప్రదాయ బద్ధంగా నేటికీ భూదేవి పండుగను జరుపుకోవడం అభినందనీయం అని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం మండలం జల్లేళ్లగూడెం పంచాయతీలోని రెడ్డికుంకాల గ్రామంలో గిరిజనులు శుక్రవారం భూదేవి పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు మెరుగ్గా పండాలని, ప్రజల ఆరోగ్యాలు చల్లగా ఉండాలని కోరుతూ ఏటా పండుగను నిర్వహిస్తామని గిరిజనులు పేర్కొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీకి డోలు వాయిద్యాలతో గిరిజన సంప్రదాయ నృత్యాలతో నిర్వహించారు. ఈ సంబరాల్లో ఎంపీపీ పాల్గొన్నారు. ఈయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు కోటం బాబూరావు, సర్పంచ్ కోటం గంగాదేవి గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జలజీవన్ మిషన్ కేంద్ర బృందం పర్యటన

దెందులూరు: గ్రామాల్లో ప్రజలందరికీ సురక్షితమైన తాగునీరు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జలజీవన్ మిషన్ ద్వారా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జలజీవన్ మిషన్ కేంద్ర బృందం పర్యవేక్షణ కమిటీ ప్రతినిధులు అభిషేక్‌ఖాన్, సత్యనారాయణ అన్నారు. శుక్రవారం దెందులూరు మండలంలో సోమవరప్పాడు, గోపన్నపాలెం గ్రామ పంచాయతీల్లో పర్యటించారు. గ్రామ సచివాలయాలు, ఇళ్ల, ట్యాప్‌లు, పారిశుద్ధ్యం, వాటర్ ట్యాంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సోమవరప్పాడు గ్రామ పంచాయతీకి రూ.1.56 కోట్లు, గోపన్నపాలెం గ్రామ పంచాయతీకి రూ.1.60 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ పథకంలో భాగంగా ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయిని అందజేసి తాగునీరు అందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. తొలుత సోమవరప్పాడు సర్పంచ్ సరిగే నాగరాజు, గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమారి, గ్రామ కార్యదర్శులతో మాట్లాడుతూ తాగునీటి సరఫరాపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండు పంచాయతీల్లో ప్రజాప్రతినిధులు చెప్పిన వివరాలు, పారిశుద్ధ్యం అమలు తీరుపట్ల కేంద్ర బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. వారి వెంట గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులు, దెందులూరు మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ భీమరాజు, గ్రామ కార్యదర్శులు శ్రీకాంత్, యోహోషువా ఉన్నారు.

ప్రభుత్వ పుస్తకాల పంపిణీ కేంద్రంలో పరిశీలన

పెదపాడు: పాఠశాల తెరిచేనాటికే ప్రభుత్వ పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేయాలని పెదపాడు మండల ప్రత్యేక అధికారి, డీపీఓ విజయ లక్ష్మి తెలిపారు. పెదపాడులోని అగస్టీన్ పాఠశాలలో ప్రభుత్వ పుస్తక కేంద్రాన్ని పాఠ్య పుస్తకాలను, నోట్ పుస్తకాలను, యూనిఫామ్‌ను శుక్రవారం పరిశీలించారు. తహసీల్దార్ జీ విజయ్‌కుమార్‌రాజు, పెదపాడు ఎంపీఈఓ సబ్బితి నర్సింహమూర్తి, డీపీఓ విజయలక్ష్మి సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ రవీంద్ర సబియా సుల్తాన్ రాధాకృష్ణ, ఏపీఎం దాసరి సుమలత ఈఓ వినోద్‌కుమార్, వీఆర్వో నటరాజ్ పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజ స్థాపనకు సమష్టి కృషి

భీమడోలు: క్షయ రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ సునీత అన్నారు. టీబీ ముక్తి భారత్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం దత్తత తీసుకున్న టీబీ రోగులకు దాత ఉన్నమట్ల సత్యనారాయణ ఆర్థిక సాయంతో వారికి ఫుడ్ బాస్కెట్లు అందించారు. ఒకొక్కరికి బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందించారు. దాత ఉన్నమట్ల సత్యనారాయణ సేవా దృక్పథాన్ని వైద్యులు అభినందించారు. వైద్యులు వి.రవిపాల్, అల్బర్ట్, రష్మీ, టీబీ సూపర్ వైజర్ తోట మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత

- ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- అచ్చుతాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం



కొయ్యలగూడెం మండలం అచ్చుతాపురంలో పథకాల బ్రోచర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి వాటికి సమప్రాధాన్యతినిస్తూ సీఎం జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. కొయ్యలగూడెం మండలం అచ్చుతాపురంలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గడపగడపకు తిరుగుతూ సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటూ ప్రచారం చేశారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులను, సచివాలయ సిబ్బందికి ఆదేశాలిచ్చారు. ఒక్కోఇంటికి వెళుతున్నప్పుడు తమ పిల్లలు జగనన్న ప్రవేశపెట్టిన విద్యా పథకాలతో మెరుగైన చదువులు చదువుతున్నారని తల్లులు, సకాలంలో పింఛను అందుతోందని తాత అవ్వలు పేర్కొంటుండడంతో ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేశారు. అచ్యుతాపురం అంతర్గత ప్రధాన రహదారి సీసీ రోడ్డు నిర్మించాలని, డ్రైనేజీ వ్యవస్థను నిర్మించాలని గ్రామస్తులు కోరారు. ప్రధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులన్నీ పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, జగనన్న సచివాలయాల మండల కో–ఆర్డినేటర్ నూకల రాము, రాష్ట్ర హిస్టరీ అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్ చిక్కాల మంగతాయారు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, గ్రామ కన్వీనర్ ముమ్మిడి రాంబాబు, ఎంపీటీసీ మందపాటి కుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, మాజీ ఎంపీపీ మట్ట సత్తిపండు, జిల్లా విద్యార్థి విభాగం కార్యదర్శి సొంగ రాకేష్, పార్టీ నాయకులు అచ్యుత గోపి, తొంటా వాసు, చిన్నం ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు అవార్డుల ప్రదానం

కుక్కునూరు: పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు శనివారం కుక్కునూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్న వలంటీర్ల వందనం కార్యక్రమంలో పాల్గొని వలంటీర్లకు అవార్డులు ప్రదానం చేస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు శుక్రవారం తెలిపారు. మండలానికి చెందిన కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నూకాలమ్మ ఆలయంలో పూజలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణానికి ఉత్తరాన కొలువైయున్న శ్రీనూకాలమ్మ వారు శుక్రవారం సందర్భంగా విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి భక్తులు భారీ సంఖ్యలో దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ గోలి శ్రీనివాసరెడ్డి, భూలక్ష్మి దంపతులు 108 కదంబ పుష్పాలు తెచ్చి, అమ్మ వారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారన్నారు. అమ్మవారి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ప్రసాదవితరణ, ఆలయ అభివృద్ధికి బోను జోగయ్య, నూకాలమ్మ దంపతుల జ్ఞాపకార్థం బుట్టాయగూడెంకు చెందిన బోను అప్పలనాయుడు, నాగమణి కుటుంబ సభ్యులు రూ.25,116 విరాళంగా అందజేశారని రాజాన తెలియజేశారు. పూజలు అనంతరం ఆలయ మర్యాదలతో అమ్మ వారి శేష వస్త్రాన్ని, చిత్ర పటాన్ని ఇచ్చి వేద ఆశీర్వాదంతో దాతలను ఘనంగా సత్కరించారు. 3వ తేదీ శనివారం సాయంత్రం 4 గంటల నుంచి ఆలయ ఆవరణలోని యాగశాలలో 51వ చండీహోమం నిర్వహిస్తున్నామని అర్చకులు మనోజ్ శర్మ తెలిపారు.

ఛత్రపతి శివాజీ పోరాటం స్ఫూర్తిదాయకం



కొయ్యలగూడెంలో శివాజీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం



జంగారెడ్డిగూడెంలో హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్న నాయకులు

కొయ్యలగూడెం: హిందూ సామ్రాజ్య దినోత్సవం, ఛత్రపతి శివాజీ పట్టాభిషిక్త దినోత్సవ కార్యక్రమం కొయ్యలగూడెం మదన గోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. హిందూ ధర్మ పరిరక్షణలో, నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయడంలో, పోరాట పటిమలో, పరమత సహనంలో ఛత్రపతి శివాజీ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఆర్ఎస్ఎస్ బౌద్ధిక ప్రముఖ కట్టా శివ గణేష్ అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల వైస్ ఎంపీపీ మట్టా వనజాలక్ష్మి సత్తిపండు హాజరై ఛత్రపతి శివాజీ ఛత్రపతి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వేదుల జనార్థన్, మట్టపర్తి వెంకటరెడ్డి, బొమ్మా శ్రీనివాసు, ఎమ్ఆర్‌పీ సత్యనారాయణ పాల్గొన్నారు.

హిందూ సామ్రాజ్య దినోత్సవం

జంగారెడ్డిగూడెం: ఛత్రపతి శివాజీ పట్టాభిషిక్తుడైన రోజు జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి రోజున హిందూ సామ్రాజ్య దినోత్సవంగా జరుపుకుంటామని విశ్వహిందూ పరిషత్ సభ్యులు కె.వి.ఆర్.సత్యనారాయణ అన్నారు. చిన్నవయసులోనే ఎన్నో కోటలు స్వాధీనం చేసుకుని ధీరత్వం ప్రదర్శిస్తూ శత్రువుల గుండెలు దడదడలాడించిన పరాక్రమ యోధుడు ఛత్రపతి శివాజీ అని పొగిడారు. ఈ కార్యక్రమంలో కొప్పాక శ్రీనివాసరావు, ఛాత్రాతి యుగంధర్ పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకర్ ప్రారంభం



మంచినీటి ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న జెట్టి గురునాథరావు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో పట్టణంలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు కుర్రెళ్ల రాంబాబు తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఉచిత మంచినీటి ట్యాంకును అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ మంచినీటి వాటర్ ట్యాంక్‌ను మాజీ ఏఎంసీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జెట్టి గురునాథరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గురునాథరావు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడాలనే ఆలోచనతో రాంబాబు చేస్తున్న సేవలు అభినందనీయమని గురునాథరావు అన్నారు. ఈ సందర్భంగా అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు రాంబాబు మాట్లాడుతూ తాగునీటి సమస్య తలెత్తిన ప్రాంతాల్లో ఉచిత వాటర్ ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తామన్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



చింతలపూడి మండలం వెలగలపల్లిలో డ్రై డే సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి: ప్రతి శుక్రవారం డ్రైడే పాటించే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని సబ్ యూనిట్ అధికారి బి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. వెలగలపల్లి గ్రామంలో శుక్రవారం దోమల నిర్మూలనపై అవగాహనా ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఫ్రైడే కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్‌కె అబ్రార్ హుస్సేన్ ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని అన్నారు. ఫ్రై డే డ్రై డే కార్యక్రమంపై ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది విస్తృతంగా ప్రచారం నిర్వహించి వారిని భాగస్వాములు చేయాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఉమా మహేశ్వరరావు, హెచ్‌పి అరుణ, సునీత, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో ఉత్సాహంగా వేసవి విజ్ఞాన తరగతులు



కొయ్యలగూడెం శాఖ గ్రంథాలయంలో డ్రాయింగ్ వేస్తున్న విద్యార్థులు



ద్వారకాతిరుమల గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు ముగింపు దశకు చేరుకున్నాయి. శుక్రవారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం 26వ రోజు విద్యార్థులతో సంఘసంస్కర్త జీవిత చరిత్రలను, దేశ నాయకుల చరిత్రలను చదివించారు. డ్రాయింగ్ విద్యార్థుల చేత వేయించారు. అనంతరం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న సాయిహనుమ కృష్ణ పాల్గొని పలు అంశాలు విద్యార్థులకు వివరించారు. రోటరీ క్లబ్ డైరెక్టర్ ఎస్‌బీజీ శేఖర్ పాల్గొని విద్యార్థులకు చదరంగం నేర్పించారు. వేసవి శిబిరాల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ బహుమతి ప్రధాన ఉత్సవం దాతల సహకారంతో చేస్తున్నట్లు లైబ్రేరియన్ యు.రాముడు తెలిపారు.

ద్వారకాతిరుమల గ్రంథాలయంలో..

ద్వారకాతిరుమల: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో శుక్రవారం విద్యార్థులకు మానసిక ప్రశాంతతకు, లక్ష్య నిర్దేశ ప్రేరణకు ఉపయోగపడే సూక్తులను వివరించారు. నైతిక విలువలను పెంపొందేందుకు ఉపయోగపడే సూక్తులను గ్రంథాలయ అధికారి గుర్రం బంగారు పాప విద్యార్థులతో చదివించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి, పాఠకులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీని అరెస్ట్ చేయాలని వినతి



కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కుక్కునూరు: ఢిల్లీలో మహిళా రెజ్లర్లపై దాడికి పాల్పడిన భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రజాపంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి షేక్ గౌస్ మాట్లాడుతూ, మహిళా రెజ్లింగ్ క్రీడాకారులను లైంగిక వేధింపుల గురిచేసిన బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఢిల్లీలో ధర్నా చేస్తున్న రేజర్లపై కేంద్ర పోలీస్ బలగాలు నిర్బంధాన్ని దమన కాండను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహిళా రేజ్లర్‌లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రెజ్లర్ల పోరాటానికి ప్రజాపంథా సంఘీభావం తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాసినేని సత్యనారాయణ, మడకం మల్లేష్, కంగాల కల్లయ్య, గుమ్మల ప్రకాష్, మంగరాజు పాల్గొన్నారు.

వైభవంగా గంగానమ్మ జాతర



పొంగుటూరు గ్రామ దేవత గంగానమ్మ జాతరలో వేషధారణలతో కళాకారులు

కొయ్యలగూడెం: పొంగుటూరు గ్రామదేవత గంగానమ్మవారి జాతర ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు జాతరకు సంబంధించిన ప్రత్యేక సంప్రదాయ పూజలు, అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నారు. ఆదివారం అమ్మవారికి మహా నివేదన, అన్న సమారాధన నిర్వహించనున్నారు. శుక్రవారం నుంచి నవదుర్గల వేషధారణ, కాళికా నృత్య ప్రదర్శనలు కోబ్రా డ్యాన్స్‌లు రెండు రోజులపాటు చేపడుతున్నట్లు జాతర కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. జాతర ఉత్సవాలకు తోడు వేసవి సెలవులు రావడంతో గ్రామంలో బంధుమిత్రులు వేలాదిగా వచ్చి చేరుకున్నారు. 45 ఏళ్ల అనంతరం నిర్వహిస్తున్న జాతర గ్రామస్తులు గుర్తుండిపోయేలా నిర్వహిస్తున్నామని ఇందుకు సుమారు రూ.60 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం రూరల్: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు లక్కవరం ఎస్సై దుర్గా మహేశ్వరరావు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చక్రదేవరపల్లికి చెందిన నీలిమకు ద్వారకాతిరుమల మండలం రాజుపాలెంకు చెందిన కంకిపాటి సురేష్‌కి నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. కొంత కాలంగా నీలిమ అనారోగ్యంతో బాధపడుతుండటంతో గత నెలలో తండ్రి వల్లిపాముల దాసు పుట్టిల్లు అయిన చక్రదేవరపల్లి తీసుకొచ్చారు. గురువారం సాయంత్రం నుంచి నీలిమ కనిపించకపోవడంతో లక్కవరం పోలీస్‌స్టేషన్‌లో దాసు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మండుతున్న ఎండలు

బుట్టాయగూడెం: భానుడు రెండు రోజుల నుంచి మళ్లీ భగభగమంటున్నాడు. పగటి పూటతో పాటు రాత్రి పూట ఉష్ణోగ్రతలు సైతం పెరిగాయి. దీంతో పాటు వడగాల్పులు వీయడంతో ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. రోహిణీ కార్తె ప్రారంభమైన నాటి నుంచి ద్రోణి కారణంగా వర్షాలు కురిసి గిరిజన ప్రాంతం చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. రెండు రోజులుగా ఉక్కపోత, వడగాల్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరి కొద్ది రోజులు ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటన నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న కలెక్టరు ప్రసన్న వెంకటేష్

పెదపాడు: కళాశాలలు తెరచే నాటికి పెదపాడు జూనియర్ కళాశాలలో నాడు– నేడు పనులు పూర్తి చేయాలని కలెక్టరు ప్రసన్న వెంకటేష్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం పెదపాడు జూనియర్ కళాశాలలో నాడు– నేడు పనులను ఆకస్మికంగా పరిశీలించారు. కళాశాలలో నాడు– నేడులో కళాశాల ఆధునీకరణకు రూ.28 లక్షలకు రూ.10లక్షలు నిధులు రావడం జరిగిందని వాటిలో రూ. 7లక్షల 20వేలు ఖర్చు చేసినట్టు తెలిపారు. కళాశాలలో అవసరమైన మరుగుదొడ్లు నిర్మాణం పూర్తయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జూన్ మాసాంతానికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అదనపు తరగతి గదులు నిర్మాణానికి వెంటనే అంచనాలు తయారు చేసి పంపాలని ఏఈ సదాశివరావును ఆదేశించారు. కళాశాల కోసం గతంలో నిర్మించిన రేకుల షెడ్డుల మరమ్మతులకు నాడు– నేడులో రీ ఎస్టిమేట్ చేయాలని ఆదేశించారు. మరమ్మతులు పూర్తయిన వెంటనే శిథిలావస్థకు చేరిన పాఠశాల షెడ్డును తొలగించాలని ఆదేశించారు. సిమెంటు, ఇసుక, కొరత లేకుండా ఎప్పటికప్పుడు ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, పెదపాడు తహసీల్దార్ జీ విజయ్‌కుమార్‌రాజు, ఏఈ సాయికృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



జైనవారిగూడెంలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బుట్టాయగూడెం: ఉపాధిహామీ కూలీలు కొలతల ప్రకారం పనులు చేసి గిట్టుబాటు కూలి పొందాలని ఎంపీపీ కారం శాంతి, ఇన్చార్జి ఎంపీడీఓ ఎం. శ్రీహరి అన్నారు. మండలంలోని జైనవారిగూడెం, కోటనాగవరం, తదితర గ్రామాల్లో చేపట్టిన ఉపాధి కూలీ పనులను శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో సమావేశం నిర్వహించి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ జాబ్‌కార్డుకు వెళ్లిన ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పించాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. ప్రస్తుతం చెరువు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని అర్హులైన ప్రతి ఒక్కరికీ పనులు కల్పిస్తున్నామని ఏపీఓ అలీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాతి సీత, ఎంపీటీసీ చారపు సుజాత, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

భారీగా టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



దొరమామిడికి చెందిన టీడీపీ, జనసేన నాయకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: మండలంలోని దొరమామిడికి చెందిన జనసేన, టీడీపీ పార్టీల నుంచి 20 కుటుంబాల వారు దుద్దుకూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అల్లూరి రమేష్, నక్కా దానియేలు, గొడ్డాడి శ్రీను, గొడ్డాడి దుర్గారావు, కన్నాటి మహేష్, నూతి కిశోర్, గండికోట జాన్‌బాబు, కన్నాటి నాగేశ్వరరావు, కఠారి సూరిబాబు, గండికోట కొండయ్య, కొండపల్లి లక్ష్మీనరసింహాచారి, ఉప్పల అంజిబాబు, నక్కా చెన్నకేశవులు, నక్కా శ్రీను, అల్లూరి నవ్య, సోడెం వెంకటలక్ష్మి, తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్న నవరత్న పథకాలు వల్ల అందరికీ మేలు జరుగుతుందని వారు చెప్పారు. ఈ నేపథ్యంలోనే తామంతా వైఎస్సార్‌సీపీలో చేరామని చెప్పారు. సర్పంచ్ తెల్లం రాముడు, పార్టీ నాయకులు కాలింగి వెంకటేశ్వరరావు, గొడ్డాడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి తహసీల్దార్ సుందర్ సింగ్ నియామకం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి తహసీల్దార్‌గా జి. సుందర్‌సింగ్‌ను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు వచ్చాయి. ద్వారాకా తిరుమల తహసీల్దార్‌గా పని చేస్తున్న సుందర్‌సింగ్‌ను జీలుగుమిల్లికి బదిలి చేస్తూ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ ఎలీషాను ఇటీవల కలెక్టర్ సస్పెండ్ చేసిన విషయం విదితమే. ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్ సందీప్ గౌడ్ ఇన్‌చార్జి ఇన్‌చార్జి విధులు నిర్వహిస్తున్నారు.

ఉంగుటూరు డీటీగా బొడ్డేపల్లి ప్రసాదు

ఉంగుటూరు: ఉంగుటూరు డిప్యూటీ తహసీల్దారుగా బొడ్డేపల్లి ప్రసాదును నియమించారు. భీమడోలు మండలం పాతూరు నుంచి ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు డీటీగా పనిచేసిన పోతురాజు ఎన్నికల డీటీగా ఇదే మండలంలో నియామకం పొందారు. ఎన్నికల డీటీగా పనిచేసిన కిరణ్మయి పోలవరం మండలం బదిలీ అయ్యారు. సివిల్ సప్లయి డీటీగా పనిచేసిన శేఖర్ దెందులూరు మండలం ఎన్నికల డీటీగా బదిలీ అయ్యారు. రావులపర్రు వీఆర్వో శ్రీనివాసరావు తల్లాపురానికి, భీమడోలు మండలం చల్లచింతలపూడి వీఆర్వో వేణు రావులపర్రు బదిలీ అయ్యారు.

సాల్వేషన్ ఆర్మీ కోర్ ఆఫీసర్‌గా మేజర్ రమణయ్య

దెందులూరు: దెందులూరు సాల్వేషన్ ఆర్మీ చర్చి కోర్ ఆఫీసర్లుగా కే.రమణయ్య, సువర్ణ నియమితులయ్యారు. కృష్ణా జిల్లా కాగులపాడు నుంచి బదిలీపై దెందులూరు వచ్చారు. ఇప్పటి వరకు కోర్ ఆఫీసర్‌గా పనిచేసిన మేజర్ వీ.ఏసుదాసు పెదపాడు కోర్ ఆఫీసర్‌గా బదిలీపై వెళ్లారు. శుక్రవారం దెందులూరు సాల్వేషన్ ఆర్మీ సంఘ పెద్దలు, యువత ఘనంగా స్వాగతం పలికారు.